క్లుప్తంగా

రేపు మండల సర్వసభ్య సమావేశం

వాల్మీకిపురం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో మంగళవారం ఉదయం 10:30గంటలకు ఎంపీపీ అరుణమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ షబ్బీర్ అహ్మద్ తెలిపారు. సమావేశానికి జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, అన్నిశాఖల అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

కంది పంటకు నిప్పు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని కందుకూరు సమీపంలోని నిమ్మకాయల ఒడ్డు వద్ద సుధాకర్ అనే రైతు పండించిన కంది పంటకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. పొలంలో కోసి ఆరబెట్టిన కంది పంటతో పాటు పొలంలో అమర్చిన పీవీసీ పైపులు కూడా కాలి బూడిద అయ్యాయి. ఈ ఘటనలో రూ.35 వేల నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు ఆదివారం వాపోయాడు.

ఎస్ఈబీ ఎస్ఐగా వై.బాబు

ములకలచెరువు: ములకలచెరువు సర్కిల్ ఎస్ఈబీ ఎస్ఐగా వై.బాబు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన చీకలబైలు సరిహద్దు చెక్‌పోస్టు నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న నారాయణస్వామి చీకలబైలు చెక్‌పోస్టుకు బదిలీ అయ్యారు. ఇసుక, కర్ణాటక మద్యం అక్రమ రవాణా, నాటుసారా తయారీని నిర్మూలించడానికి కృషి చేస్తానని ఎస్ఐ పేర్కొన్నారు.

నేడు ఎక్సైజ్ వాహనాల వేలం

గుర్రంకొండ: గుర్రంకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన ఎక్సైజ్ వాహనాలను వేలం వేయనున్నట్లు ఎస్ఐ దిలీప్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 9.30 గంటలకు రాయచోటి డీఎస్పీ శ్రీధర్, కలకడ సీఐ నాగేంద్ర ఆధ్వర్యంలో ఎనిమిది వాహనాలకు వేలం నిర్వహిస్తామన్నారు. ఐదు ద్విచక్రవాహనాలు, మూడు ఎల్ఎంవీ వాహనాలు ఉన్నాయన్నారు. వేలంలో పాల్గొనే వారు ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

గడ్డివామి దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న గ్రామస్తులు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని సంపతికోట పంచాయతీ ముంతపోగులవారిపల్లిలో ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో బూర్లపల్లి రవి అనే రైతుకు చెందిన గడ్డివామి దగ్ధం కావడంతో స్థానికులు మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. ఘటనలో రూ.40 వేల నష్టం వాటిల్లినట్లు గ్రామస్తులు తెలిపారు.

యల్లమ్మతల్లికి ప్రత్యేక పూజలు

కేవీపల్లె : మండలంలోని గర్నిమిట్టలో వెలసిన శ్రీ గర్నిమిట్ట యల్లమ్మతల్లికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, అర్చనలు, ప్రత్యేక పూజలు, మంగళహారతి, తీర్థప్రసాదాలు వినియోగం నిర్వహించారు. గర్నిమిట్ట పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారికి బోణాలు ఊరేగింపుగా తీసుకొచ్చారు. మంగళవాయిద్యాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు. అమ్మవారికి బోణాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

నేషనల్ మీన్స్‌కం మెరిట్ టెస్ట్‌కు స్పందన



కలకడ ప్రభుత్వ పాఠశాలలో ఎన్ఎంఎంఎస్ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

కలకడ : ఎన్ఎంఎంఎస్ గ్రాండ్ టెస్ట్‌కు విశేష స్పందన లభించినట్లు పరీక్ష కో–ఆర్డినేటర్ మధుసూదన్, ఇన్‌చార్జ్ రమేష్‌కుమార్ తెలిపారు. ఆదివారం కలకడ ప్రభుత్వ పాఠశాలలో నేషనల్ మీన్స్‌కం మెరిట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం 8వ తరగతి విద్యార్థులకు నేషనల్ మీన్స్‌కం మెరిట్ టెస్ట్ నిర్వహిస్తోందని, ఈపరీక్షలో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు నాలుగు సంవత్సరాల పాటు ప్రతి ఏడాది రూ.12వేలు చొప్పున ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు వారు తెలిపారు. ఆదివారం నిర్వహించిన పరీక్షకు 48 మంది హాజరైనట్లు తెలిపారు.

రెడ్డెమ్మకొండపై భక్తుల రద్దీ

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. ఈసందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి నైవేద్యం సమర్పించి పంచామృతాభిషేకాలు చేశారు. సంతానం కోసం మహిళలు ఆలయపరిసరాల్లో ఆకుపసరు సేవించి అమ్మవారి ఎదుట వరపడ్డారు.

చదువుకున్న ప్రతి ఒక్కరికీ
అర్హత ఆధారంగా ఉద్యోగాలు

- మెగా జాబ్‌మేళాను విజయవంతం చేయండి
- ఫిబ్రవరి 10న బీటీ ప్రభుత్వ కళాశాలలో నిర్వహణ
- 5 వేల మందికి ఉద్యోగావకాశాలు
- ఎమ్మెల్యే నవాజ్‌బాషా, స్కిల్‌డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అజయ్‌రెడ్డి



మెగాజాబ్‌మేళా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా, ఏపీఎస్‌డీసీ చైర్మన్ అజయ్‌రెడ్డి

మదనపల్లె : రాష్ట్రంలో చదువుకున్న ప్రతి ఒక్కరికీ అర్హత ఆధారంగా ఉద్యోగాలు, ఉపాధి కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే నవాజ్‌బాషా, ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అజయ్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎంపీ మిథున్‌రెడ్డి ఆధ్వర్యంలో ఫిబ్రవరి 10వ తేదీన నిర్వహిస్తున్న మెగా జాబ్‌మేళాను విజయవంతం చేయాలని వారు కోరారు. ఆదివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మెగా జాబ్ మేళా ఏర్పాట్లకు సంబంధించి నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నవాజ్‌బాషా మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎంపీ మిథున్‌రెడ్డి ఆధ్వర్యంలో మెగాజాబ్ మేళా నిర్వహిస్తున్నామన్నారు. నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు తీసుకువచ్చి వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే సదుద్దేశంతో నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు మెగాజాబ్‌మేళాను బాధ్యతగా భావించాలన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి నిరుద్యోగుల వివరాలను సేకరించి, మెగాజాబ్‌మేళాపై అవగాహన కల్పించి, వారి అర్హతలకు ఏ ఉద్యోగం వస్తుందో.. దానికి ఏ నైపుణ్యాలు కావాలో వారికి తెలిపి, ఏ కంపెనీకి వారు సరిపోతారో...తెలిపి ఉద్యోగం తెచ్చుకునేలా చూడాలన్నారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అజయ్‌రెడ్డి మాట్లాడుతూ..ఎంపీ పెద్దిరెడ్డిమిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్‌బాషా ఆధ్వర్యంలో జరుగుతున్న మెగాజాబ్‌మేళాపై సచివాలయ సిబ్బంది వలంటీర్ల సహాయంతో ఇంటింటికీ వెళ్లి విస్తృతప్రచారం కల్పించాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆశయం మేరకు స్కిల్ కార్పొరేషన్ విద్య, నైపుణ్యం, ఉద్యోగం అనే పద్ధతిలో పనిచేస్తోందన్నారు. 175 నియోజకవర్గాల్లో 175 స్కిల్‌హబ్‌లను ఏర్పాటుచేసే దిశగా తొలివిడతలో 67 స్కిల్ హబ్‌లను ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో 26 స్కిల్ కాలేజీలను ఏర్పాటు చేస్తున్నామని, స్కిల్ యూనివర్సిటీ ముఖ్యమంత్రి పరిశీలనలో ఉందన్నారు. స్కిల్‌డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా రాష్ట్రంలో 50,000 మంది విద్యార్థులకు నైపుణ్యాలపై శిక్షణ ఇచ్చామన్నారు. దేశంలోనే ఇప్పటివరకు ఇలాంటి ఆలోచన మరే ముఖ్యమంత్రి చేయలేదన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించాలనే లక్ష్యంతో జాబ్ కేలండర్ డిక్లేర్ చేయడం జరిగిందన్నారు.

ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో ప్రతి నెలా 1 మెగాజాబ్‌మేళా, 1 మినీ జాబ్‌మేళా చొప్పున నెలకు 52 జాబ్ మేళాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం మెగాజాబ్‌మేళాకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా అధికారి హరికృష్ణ, ఏపీఎండీసీ చైర్‌పర్సన్ షమీంఅస్లాం, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, వైస్‌చైర్మన్ జింకాచలపతి, జెడ్పీటీసీలు ఉదయ్‌కుమార్, సీహెచ్.రామచంద్రారెడ్డి, ఎంపీపీ నరసింహులు, వెలుగుచంద్ర, వైస్ ఎంపీపీ వెంకటరమణారెడ్డి, సింగిల్‌విండో చైర్మన్‌లు దండుకృష్ణారెడ్డి, కేశవరెడ్డి, రెడ్డిశేఖర్‌రెడ్డి, మార్కెట్‌కమిటీ డైరెక్టర్ తట్టి శ్రీనివాసులురెడ్డి, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ ఆనందపార్థసారధి, సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు పాల్గొన్నారు.

కృష్ణావతారంలో శ్రీలక్ష్మీజనార్ధనస్వామి



కృష్ణ అవతారంలో దర్శనమిచ్చిన లక్ష్మీజనార్ధనస్వామి

రామసముద్రం: మండల కేంద్రంలో వెలసిన శ్రీలక్ష్మీ జనార్ధనస్వామి బ్రహ్మోత్సవంలో భాగంగా ఆదివారం స్వామివారు కాళియా మర్దనం (కృష్ణావతారం)లో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు , పంచామృతాభిషేకాలు , కుంకుమార్చనలు ఘనంగా నిర్వహించారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు పార్థసారధిభట్టర్, కులశేఖర్ భట్టర్ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం స్వామివారికి ఊంజల సేవ నిర్వహించారు. రాత్రి ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారి సేవలో పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలను విస్తృతం చేద్దాం



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు క్రిష్ణమూర్తి

వాల్మీకిపురం: సమాజంలోని నిరుపేదలను ఆదుకునేందుకే మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అందిస్తున్న సేవలను మరింత విస్తృతం చేద్దామని ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు క్రిష్ణమూర్తి అన్నారు. ఆదివారం స్థానిక భగవాన్ సత్యసాయి మందిరంలో మానవత సంస్థ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలను ఆదుకునేందుకు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. మనిషి జీవితానికి పరిపూర్ణత చేకూరాలంటే కుటుంబం, స్వార్థం కాకుండా సమాజం కోసం సేవ చేయాల్సిన ధర్మం ఉందన్నారు. పచ్చదనం కార్యక్రమం కింద మొక్కలను నాటే కార్యక్రమాలను చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కేశవ రెడ్డి, రమణమూర్తి, శంకర, రామక్రిష్ణారెడ్డి, పివి నారాయణ, ఆనంద శెట్టి, సివి రమణ, లక్ష్మన్న, లక్ష్మినారాయణ, సారధి, మణి, సత్య, తదితరులు పాల్గొన్నారు.

మానవత సంస్థ సేవలు విస్తృతం చేస్తాం

పీలేరు : మానవత సేవలు మరింత విస్తృతం చేస్తామని ఆ సంస్థ చైర్మన్ వి. రామచంద్ర అన్నారు. ఆదివారం స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో సంస్థ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీలేరులో విద్యుత్ స్మశాన వాటిక ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం గణతంత్ర దినోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు వెంకటరమణ, షీ సంస్థ అధ్యక్షురాలు పి.వి.ఎస్. లక్ష్మీ, రాయల సుధాకర్, శెట్టి సుబ్రమణ్యం, జి.వి. రమణ, రామ్మోహన్, లక్ష్మీ ప్రసాద్‌నాయుడు, ప్యారూఖాన్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



వాలీబాల్ విజేతజట్టుకు ట్రోఫీ, ప్రశంసాపత్రాన్ని అందిస్తున్న డాక్టర్ గురుప్రసాద్ తదితరులు

మదనపల్లె : గ్రామీణ ప్రాంత విద్యార్థులు చదువుతో పాటుగా క్రీడల్లో రాణించి ఉన్నతస్థానాలకు చేరుకోవాలని జ్ఞానాంబిక విద్యాసంస్థల కరస్పాండెంట్ డాక్టర్.ఆర్.గురుప్రసాద్ అన్నారు. ఆదివారం బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆజాదీకా అమృత్ మహోత్సవ్ వేడుకల్లో భాగంగా నెహ్రూ యువకేంద్రం, యూత్‌కరాటే క్లబ్ ఆధ్వర్యంలో బ్లాక్ లెవల్ స్పోర్ట్స్ మీట్ వాలీబాల్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్.గురుప్రసాద్ మాట్లాడుతూ.. విద్యార్థి దశలో క్రీడలపై ఆసక్తి పెంచుకోవడం వల్ల ఏకాగ్రత, క్రమశిక్షణ, శారీరక, మానసిక ఆరోగ్యంతో పాటుగా చక్కగా చదువుకునేందుకు అవకాశం కలుగుతుందన్నారు. స్పోర్ట్స్‌మీట్‌లో 12 జట్లు పాల్గొన్నాయని, అందులో జ్ఞానాంబిక కళాశాల మహిళల జట్టు, బీటీ కళాశాల పురుషుల జట్టు రన్నర్‌గా నిలిచాయన్నారు. గెలుపొందిన జట్లకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా మెడల్స్, ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో బీటీ కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ వెంకటశివారెడ్డి, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అన్నమయ్యజిల్లా సెక్రటరీ వసంత, డీఎస్‌డీఓ షఫీ, యూత్ కరాటేక్లబ్ వ్యవస్థాపకులు ఏ.ఆర్.సురేష్ పాల్గొన్నారు.

న్యాక్ గుర్తింపులో భాగస్వామ్యులు కావాలి



మాట్లాడుతున్న కో-ఆర్డినేటర్ వెంకటశివారెడ్డి

మదనపల్లె : అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ న్యాక్ గుర్తింపులో ప్రతి విద్యార్థి భాగస్వామ్యులై.. మెయిల్ సర్వేకు సహకరించాలని కో–ఆర్డినేటర్ డి.వెంకటశివారెడ్డి కోరారు. ఆదివారం బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని డాక్టర్.బి.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ లర్నర్ సపోర్ట్ సెంటర్‌లో విద్యార్థులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వెంకటశివారెడ్డి మాట్లాడుతూ నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడియేషన్ కౌన్సిల్ (న్యాక్) గుర్తింపులో భాగంగా స్టడీసెంటర్‌లోని ప్రతి విద్యార్థికి మెయిల్స్ వస్తాయన్నారు. అందులో గూగుల్ ఫారంను ఓపెన్‌చేసి ఓపెన్ యూనివర్సిటీ విద్యార్థులకు అందిస్తున్న సేవలపై సర్వే రూపంలో అడిగిన ప్రశ్నలకు సమాధానాలు నమోదు చేయాలన్నారు. సర్వేని ఎలా పూర్తిచేయాలో డెమో రూపంలో తెలియజేశారు. సుచిత్ర, మహేందర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, జిబా తదితరులు విద్యార్థులకు అవగాహన కల్పించారు.

డ్రోన్ టెక్‌తో మిట్స్ ఒప్పందం



ఒప్పంద పత్రాలను చూపుతున్న అధ్యాపకులు

కురబలకోట: విజయవాడ ఫోపెల్ డ్రోన్ టెక్‌తో అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల అనుబంధ ఒప్పందం కుదుర్చుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ యువరాజ్ ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ వివాహాల సమయంలో ఫొటో గ్రఫీ కోసం డ్రోన్లు ఉపయోగించడం సర్వసాధారణంగా మారిందన్నారు. అయితే వీటిని మానవ రహిత ఎగిరే వాహనాలుగా చెప్పవచ్చన్నారు. రిమోట్ సాయంతో ఆకాశంలో ఎగిరే రాబోట్‌లుగా కూడా భావించవచ్చన్నారు. వ్యవసాయ, రాజకీయ, భూముల సర్వే తదితర వివిధ రంగాల్లో వీటి వినియోగం పెరుగుతోందన్నారు. ఈ ఒప్పందం ద్వారా అధ్యాపకులకు, విద్యార్థులకు శిక్షణతో పాటు ఇంటర్న్‌షిప్ లభిస్తుందన్నారు. ఉద్యోగ,ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు.

వాహనాలు నడుపుతూ సెల్‌ఫోన్ వాడొద్దు

మదనపల్లె సిటీ: డ్రైవర్లు వాహనాలు నడిపే సమయంలో సెల్‌ఫోన్లు వాడరాదని ఆర్టీసీ డిపో–2 మేనేజర్ ఆర్‌సీ నిరంజన్ అన్నారు. ఆదివారం స్థానిక డిపో ఆవరణంలో రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా డ్రైవర్లు, సిబ్బందికి రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడరాదన్నారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్యాలను చేర్చాలన్నారు.

ఇద్దరు జూదరుల అరెస్ట్

మదనపల్లె : పట్టణంలోని చంద్రాకాలనీ సమీపంలో కోడిపందెం ఆడుతున్న ఇద్దరిని సీఐ మురళీకృష్ణ ఆదేశాల మేరకు అరెస్ట్‌చేసినట్లు టూటౌన్ ఏఎస్ఐ వెంకటరమణ తెలిపారు. నిందితుల వద్ద నుంచి రూ.1,050 నగదు, రెండు పందెంకోళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేశామన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన

మదనపల్లె : మదనపల్లె ఎంపీపీ రెడ్డెమ్మ, ఎంఎస్ఎంఈ డైరెక్టర్, సర్పంచ్ ఆనంద పార్థసారధి ఆధ్వర్యంలో సీటీఎంలోని ఎంపీపీ స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. అమ్మ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌కు చెందిన వైద్యులు సందీప్, అంకితరెడ్డి, జాన్ తదితరులు గుండె, షుగర్, బీపీ పరీక్షలు ఉచితంగా నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వెలుగుచంద్ర, సింగిల్‌విండో వైస్‌చైర్మన్ వీరప్రతాప్, ఆర్‌బీకే చైర్మన్ శివారెడ్డి, వైస్ సర్పంచ్ ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

సమస్యలను కలసికట్టుగా పరిష్కరించుకుందాం

వాల్మీకిపురం: విశ్రాంత ఉద్యోగుల సమస్యలను కలసికట్టుగా పరిష్కరించుకుందామని ఆ సంఘం మండల అధ్యక్షులు శంకర అన్నారు. ఆదివారం స్థానిక సత్యసాయి మందిరంలో విశ్రాంత ఉద్యోగుల సమావేశాన్ని నిర్వహించారు. రాబోవు రోజుల్లో సంఘ సభ్యుల్లో ఎవ్వరికీ ఏ సమస్య వచ్చినా ఉమ్మడిగా పోరాటం చేసి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. అనంతరం ఈకేవైసీ, లైఫ్ సర్టిఫికెట్, ఆధార్‌కు ఫోన్ లింక్, హెల్ప్ యాప్‌లో ఆధార్ లింక్ తదితర అంశాలపై చర్చించారు.

పొలంబడితో విప్లవాత్మక మార్పులు



సరిమడుగులో పొలంబడి నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులు

గుర్రంకొండ: పొలంబడి కార్యక్రమంతో వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు తెస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి రత్నమ్మ తెలిపారు. ఆదివారం మండలంలోని సరిమడుగు గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులతో వరి పంట సాగుపై రైతులకు ప్రయోగాత్మకంగా వివరించారు. అనంతరం ఏఓ మాట్లాడుతూ ఒకటిన్నర ఎకరం పొలంలో రైతు ఒక ఎకరం పంట సాగు చేస్తే మిగిలిన అర ఏకరంలో వ్యవసాయాధికారులే పంటను ప్రయోగాత్మకంగా సాగు చేస్తారన్నారు. నూతన సాగు విధానం, రైతుల సాగు విధానానికి వ్యత్యాసం చూపించి అవగాహన కల్పిస్తామన్నారు. ఎంపీఈవోలు రిజ్వానా, సమీనా, వీవోలు శిరిష,శ్రావణి మోగిత రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులు పోటీ తత్వం అలవర్చుకోవాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

పీలేరు రూరల్ : విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకోవాలని స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు ఫారూఖాన్ అన్నారు. ఆదివారం పట్టణంలోని కోటపల్లె జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్) మోడల్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీ పరీక్షల్లో విద్యార్థులు రాణించడానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. ఎన్ఎంఎంఎస్ పరీక్షలకు కేవీపల్లె, పీలేరు మండలాల్లోని ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. ఇందులో మొదటి స్థానంలో కార్తీక్ (తలపుల జెడ్పీహెచ్ఎస్), ద్వితీయ స్థానంలో అబ్దుల్‌హమీద్ (పీలేరు ఉర్దూ జెడ్పీహెచ్ఎస్), తృతీయ స్థానం రక్షిత (పీలేరు గరల్స్ జెడ్పీహెచ్ఎస్) సాధించి బహుమతులు పొందినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం శివశంకరయ్య, సంఘం నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, నాగరాజరెడ్డి, గఫార్‌ఖాన్, శ్రీనివాసులు, అంజిరెడ్డి, సుదర్శన్, పరుశురామ్, శేషాద్రిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దాతల సాయం మరువలేనిది



మానవత సంస్థకు రూ.లక్ష నగదు వితరణ చేస్తున్న దాత చందు

కలకడ : మంచిపని కోసం మానవత సంస్థకు దాతలు అందిస్తున్న సహాయం మరువలేనిదని ఆ సంస్థ అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు గంగాద్రి అన్నారు. ఆదివారం కలకడ క్లస్టర్ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన నెలవారి మానవత సంస్థ సమావేశంలో వారు పాల్గొని ప్రసంగించారు. మానవత సేవలు కేవలం మండలంలోనే కాక, కలికిరి, కెవిపల్లె, గుర్రంకొండ మండలాలతో పాటు ఇతర సుదూర ప్రాంతాల వారికి కూడా అందించడం అభినందనీయమన్నారు.

రూ.లక్ష విరాళం :

మూడు మండలాల్లో కలకడ మానవత సంస్థ అందిస్తున్న సేవలకు ఆకర్షితులైన మండలంలోని పోతువారిపల్లె గ్రామానికి చెందిన చందు రూ.లక్ష నగదును సేవా కార్యక్రమాలకు వినియోగించాలని సభ్యులకు అందజేశారు. వారి దాతృత్వానికి సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాసులురెడ్డి, చైర్మన్ సుధాకర, మండలశాఖ గౌరవ అధ్యక్షుడు లక్ష్మిరెడ్డి, కార్యదర్శి సైయ్యద్‌సాహెబ్, కోశాధికారి లక్ష్మన్న, సభ్యులు వైవి రమణ, జివి, వెంకటేశ్వరరావు, పివి నాయుడు, బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కాలనీకి స్వచ్ఛమైన తాగునీరు



కాలనీలో కొత్తబోరు ప్రారంభించిన నాయకులు

పీలేరు రూరల్ : మండలంలోని కాకులారంపల్లె పంచాయతీ ఇందిరమ్మ కాలనీలో ప్రతి కుటుంబానికి స్వచ్ఛమైన తాగునీరు అందిస్తున్నట్లు సర్పంచ్ హరిణి సురేష్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ఇందిరమ్మ కాలనీకి పైపులైన్ ద్వారా తాగునీరు సరఫరా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 3 వేలు కుటుంబాలు జీవనం సాగిస్తున్న ఇందిరమ్మ కాలనీకి రూ.15 లక్షలతో రెండు బోర్లు, రెండు మోటార్లు, పైపులైన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండల నిధులు రూ.5 లక్షలతో ఆర్‌వో ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బిందు, నాయకులు కాకులారంపల్లె రమేష్‌రెడ్డి, రమణ, మోహన్‌రెడ్డి, మదనమోహన్‌రెడ్డి, నాగరాజ, రమేష్‌రెడ్డి, జయచంద్ర, దావూద్‌బాషా, మునికుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసా.. శ్రీ వేంకటేశా..గోవింద



తంబళ్లపల్లె : మండలంలోని కోసువారిపల్లెలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో తొమ్మిది రోజులుగా టీటీడీ ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఆదివారం అర్చకులు కృష్ణప్రసాద్ భట్టార్, రాఘవేంద్రస్వామి, రమేష్‌బాబులు శ్రీ శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడిని పల్లకీలో ప్రత్యేక అలంకరణ చేశారు. పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు స్వామివారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాల నడుమ శ్రీవారిని పల్లకీలో ఊరేగించారు. రాత్రికి స్వామివారిని అశ్వవాహనంపై ప్రత్యేక అలంకరణతో పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయలక్ష్మి, ఎంపీటీసీ శ్యామలమ్మ, కోటిరెడ్డి, హరీష్, రఘునాథ్, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు ‘ఏ’ సర్టిఫికెట్ పరీక్షలు

పీలేరు : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ క్యాడెట్లకు ‘ఏ సర్టిఫికెట్ పరీక్షలు నిర్వహించారు. పట్టణంలోని పీలేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, నెహ్రూ బజార్‌లోని జెడ్పీ మెయిన్ ఉన్నత పాఠశాల, కోటపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 140 మంది ఎన్‌సీసీ క్యాడెట్లకు ఆదివారం పరీక్షలు నిర్వహించారు. తిరుపతి 9వ బెటాలియన్‌కు చెందిన హవల్దార్ బాలకృష్ణ, విజయ్‌బహదూర్ డ్రిల్, థియరీ పరీక్షలు నిర్వహించారు. ప్రతిభ ఆధారంగా సర్టిఫికెట్లు ఇవ్వనున్నట్లు ఎన్‌సీసీ అధికారులు మురళి, రెడ్డెప్పరెడ్డి, జయపాల్ రెడ్డి తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఔదార్యం



పాఠశాలకు వితరణ చేసిన బిరువాలు, కంప్యూటర్

కురబలకోట: మండలంలోని పిచ్చలవాండ్లపల్లె ప్రభుత్వ యూపీ స్కూల్ పూర్వ విద్యార్థులు రూ.40 వేలు విలువ చేసే రెండు బీరువాలు, మైక్‌సెట్, కంప్యూటర్, విద్యా సామగ్రి అందజేసినట్లు ఎంఈఓ ద్వారకనాథ్ ఆదివారం తెలిపారు. అదే గ్రామానికి చెందిన నల్లసానివారపల్లె ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో హెడ్మాస్టర్ జీవీ ప్రసాద్ వద్ద డి. హరినాథరెడ్డి, డి.పవన్‌కుమార్, డి. మణికంత, ఎస్. భార్గవరెడ్డి చదువుకున్నారు. వీరంతా ఉద్యోగాలలో స్థిరపడ్డారు. పిచ్చలవాండ్లపల్లె యూపీ స్కూల్‌కు అవసరమైన సామగ్రిని విరాళంగా అందజేసి ఔదార్యాన్ని చాటుకున్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్థుల అభిమానాన్ని పొందారు. ఈ సందర్భంగా జెడ్పీహెచ్ఎస్ హెడ్మాస్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, హెచ్ఎం వెంకట్రమణ, డి. రామక్రిష్ణారెడ్డి, విశ్వనాథరెడ్డి, సుబ్బిరెడ్డి, రాజారెడ్డి, గోపాలకృష్ణారెడ్డి, చిన్నరెడ్డి తదితరులు పాల్గొన్నారు.